క్లుప్తంగా

బిడ్డకు తల్లిపాలనే ఇవ్వాలి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరెడ్డి

బనగానపల్లెరూరల్: పుట్టిన శిశువులకు తల్లి పాలను తప్పనిసరిగా ఇవ్వాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కైప గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లలో టంగుటూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్యామిలి ఫిజిషియన్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో పాటు రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. తల్లిపాల ప్రాముఖ్యత, పాలలో ఉన్న పోషకాపై గర్భిణీ,బాలింతలకు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చార్మిల, ఏఎన్ఎం అబిదా తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు తాగునీటి వసతి



ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

డోన్: ఈ ఏడాది ఆఖరునాటికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి వసతి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని డోన్ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి, బి.రామదుర్గం సర్పంచ్ మాదన్న అన్నారు. మండల పరిధిలోని బి.రామదుర్గంలో రూ.25లక్షలతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి బుధవారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.350 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలోని ఇంటింటికి తాగు నీరు అందించేందుకు పైపులైన్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణం ప్రభుత్వం చేపడుతుందన్నారు.

ఉద్యోగుల వివరాలు అందజేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ట్రెజరీ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మిదేవి

కోవెలకుంట్ల: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో సస్పెన్షన్ ఉద్యోగుల వివరాలను ఆయా శాఖల డీడీఓలు అందజేయాలని జిల్లా ట్రెజరీ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మిదేవి సూచించారు. బుధవారం స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో జరుగుతున్న ఆడిట్‌ను ఆమె పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం నాయకులు ముత్తోజ్ వీరబ్రహ్మం, రామకృష్ణారెడ్డి, ఏపీఎన్జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి తదితరులు అసిస్టెంట్ డైరెక్టర్‌ను కలిసి పెన్షనర్ల సమస్యలు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తో సస్పెన్షన్ ఉద్యోగుల వివరాలు ఇవ్వకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.

బలిజ సంఘం మండల అధ్యక్షుడిగా నారాయణ



ప్రెసిడెంట్‌ను సత్కరిస్తున్న సభ్యులు

అవుకు: స్థానిక బలిజ సంఘం కార్యాలయంలో అవుకు మండల నూతన ప్రెసిడెంట్‌గా కంపిలి నారాయణను బుధవారం సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం ఆయనను సభ్యులు ఘనంగా సన్మానించారు. బలిజలు ఐకమత్యంగా మెలగాలని, సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తానని ఈ సందర్భంగా కంపిలి నారాయణ తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కునుకుంట్ల రామన్న, నీరుకట్టు కిట్టన్న, దంతెల రమణ, వేటూరి రమణ, జక్కా మధు, వెంకటేశ్వర్లు, బసెట్టి శ్రీరాములు, బారు శివన్న, మామిళ్ల సుబ్బన్న, మెడికల్ ప్రసాద్, రామాంజినేయులు, వేణుగోపాల్, గాజుల కృష్ణకుమార్, పోతుల మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

డోన్: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం మున్సిపల్ డీఈ సురేష్, ఏఈ హితేష్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. నెహ్రూనగర్ పార్కులో నిర్మిస్తున్న స్విమ్మింగ్‌పూల్, రైల్వేస్టేషన్ రహదారి డివైడింగ్ పనులు, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పార్కు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించిన కమిషనర్ రెండునెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు.

తల్లీబిడ్డ సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల



వైఎస్సార్ సంపూర్ణపోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

బనగానపల్లె: తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణపోషక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బనగానపల్లె ఏసీ డీపీఓ రోజారాణి అధ్యక్షతన బుధవారం స్థానిక పొదుపు భవనంలో టేక్‌హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణపోషక ఆహారం కిట్లను వారు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నాణ్యతలేని పౌష్టికాహారం పంపిణీ చేయడం మూలంగా గర్భిణులు, బాలింతలు అనారోగ్యాల భారినపడి ఇబ్బందులు ఎదుర్కున్నారన్నారు. ప్రస్తుతం పూర్తి నాణ్యతగా అందజేస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలలోనే పౌష్టికాహారం భుజించాల్సిన అవసరం లేదని, ఇళ్లకే సరుకులు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వైఎస్సార్ సంపూర్ణపోషక ఆహారం కిట్‌లో మూడు కిలోల బియ్యం, బెల్లం, కందిపప్పు, పాలు, గుడ్లు, ఖర్జూరం తదితర 10 రకాల సరుకులు ఉంటాయని, మీ ఇష్టానికి అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తుందన్నారు. గర్భవతులు చిన్నపిల్లల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని గుర్తించిన ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఎంపీపీ మానసవీణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేటలో 5, 6 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పేస్ యాప్ ద్వారా డీటీ సత్య దీప్, ఐసీడీయస్ సూపర్ వైజర్లు తిప్పమ్మ, రాధామ్మ పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేశారు. సిమెంట్ నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం -2లో గ్రామ సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత, మహిళా పోలీస్ మాధవి, గ్రామ వైఎస్సార్‌పీ నాయకులు యాకోబ్, యోబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌వి శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రాధదేవి, లక్ష్మీ, మేరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సంపూర్ణ పోషణ కిట్లను ఎంఈఓ రాజయ్య గర్భిణులు, బాలింతలకు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇకపై ప్రతి నెలా రెండు సార్లు ఇంటి వద్దకే కిట్లను అందిస్తారని ఈ సందర్భంగా ఎంఈఓ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ : మండలంలోని బి.రామదుర్గంలో ఐసీడీఎస్, పొదుపు సంఘాల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు బుధవారం టేక్ హోమ్ రేషన్ కింద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సర్పంచ్ నాగన్న పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల ఏపీఎం రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజామల: స్థానిక మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయకుమార్ రెడ్డి, ఐసీడీస్ సూపరైజర్ శాంత, ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వారు అందజేశారు.

ప్యాపిలి: స్థానిక 10 వ అంగన్‌వాడి సెంటర్‌లో బుధవారం గర్భిణులు, బాలింతకలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దేవకృపమ్మ, సుగుణ, శకుంతల అందజేశారు. ప్రభుత్వం గర్భిణీ, బాలింతల, చిన్నారులను దృష్టిలో ఉంచుకుని ఐసీడీఎస్ ద్వారా సంపూర్ణ పోషకాహారాన్ని అందజేస్తోందని సూపర్‌వైజర్లు తెలిపారు.

కోవెలకుంట్ల: మాతా, శిశు మరణాల తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి సూచించారు. బుధవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు సంబంధించిన టేక్‌హోం కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. ఎంపీపీతోపాటు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యానారాయణరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు, ఆయిల్ తదితర పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ గోపీనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణపోషక ఆహారం కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న మల్కిరెడ్డి

సంజామల: మండల పరిధిలోని నొస్సంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. మల్కిరెడ్డి మాట్లడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాలకు మంచి చేయాలనే లక్ష్యంతో పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బైరెడ్డి విజయ బాస్కర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది మల్లికార్జున, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న దృశ్యం



కిట్లను అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్లు



పౌష్టికాహార సరుకులు అందజేస్తున్న ఎంఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

నేడు ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

డోన్ టౌన్ : ఐటీఐలో మిగిలి పోయిన సీట్ల భర్తీ కోసం రెండవ విడుత ప్రవేశాల నిమిత్తం గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్స్‌పాల్ ప్రతాప్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. 3వ తేది ఉదయం 9 నుంచి సాయత్రం 5గంటల వరకు మెరిట్ నంబరు 1నుండి 339 అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. మెరిట్ లిస్టులో సీటు రానివారు మేనేజ్‌మెంట్ కోటా కింద ప్రవేశం పొందాలనుకుంటే ప్రిన్స్‌పాల్‌ను సంప్రదించాలన్నారు.

ఆకుమల్ల పీఎసీయస్ చైర్మన్‌గా నాగేశ్వర్ రెడ్డి



సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ ఆకుమల్ల గ్రామ సీనియర్ నాయకునిగా పేరున్న ఈయనకు సముచిత స్థానం దక్కిందని నాయకులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లెప్రసీ యూనిట్ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ శారదాబాయి

డోన్: నియోజకవర్గంలో కొత్తగా ఎలాంటి లెప్రసీ(కుష్టు) వ్యాధి కేసులు నమోదు కాకపోవడం సంతృప్తినిస్తుందని జిల్లా అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ(లెప్రసీ, క్షయ నివారణ అధికారి) డాక్టర్ శారదాబాయ్ అన్నారు. బుధవారం డోన్ ఏరియా ఆసుపత్రిలో లెప్రసీ యూనిట్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ ట్రీట్‌మెంట్ అధికారులు అనిల్‌కుమార్, ఖరీముల్లా పాల్గొన్నారు.

9 నుంచి 'నాభూమి- నాదేశం కోసం'

బేతంచెర్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు చేపట్టనున్న నాభూమి-నా దేశం కోసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంగన్న సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీల్లో 75 మొక్కలను గ్రామ సచివాలయాలు, పాఠశాలలు, అమృత సరోవర్ కుంటల వద్ద నాటాలన్నారు. అలాగే దేశ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధులు, పోలీస్ అమర వీరుల పేర్లను శిలాఫలకాలపై రాయించాలని సూచించారు.

ఓటర్ల జాబితా రూపొందించేందుకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ : ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు అధికార యంత్రాంగానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమావేశహాల్‌లో బుధవారం వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు అందరి సహకారం తీసుకోవాలన్నారు. ఓటర్ల డబుల్ ఎంట్రీలు ఉంటే పోలింగ్ సందర్భంలో ఘర్షణలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. స్థానికుల సహకారంతో మృతుల పేర్లను కూడా ఓటర్ల జాబితా నుండి తొలగించాలన్నారు. సమావేశంలో డోన్, బేతంచెర్ల, ప్యాపిలి తహసీల్దార్లు విద్యాసాగర్, నరేంద్రనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ వర్మ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, సపీఎం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదుతండాకు చెందిన సక్రూనాయక్ గత నెల 31వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి తరుపున ప్రభుత్వం వైఎస్సార్ బీమా ప్రీమియం చెల్లించడంతో బాధిత కుటుంబం బీమాకు అర్హత పొందింది. తక్షణ సాయం కింద మంజూరైన రూ.10వేలు మృతుడి భార్య శంకరమ్మ బాయికి అందజేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర బాబు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న దాతలు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లెరూరల్: రక్తదానం చేసిన వ్యక్తులు ప్రాణ దాతలతో సమానమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి జయంతి సందర్భంగా కాటసాని నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా నాగార్జునరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, కుటుంబ సభ్యులు నివాళులర్పించి కేక్‌కట్ చేశారు. అనంతరం మెగారక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అత్యవసర సమయాల్లో చాలా మంది బాధితులకు రక్తం లభించక మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వారికి రక్త సాయం చేయడం వలన వారికి పునర్జన్మ కల్పించిన పుణ్యం రక్తదాతలకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి దంపతులు, ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, ఎమ్మెల్యే కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి, నాయకులు సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శంకర్‌రెడ్డి, నిచ్చెనమెట్ల గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కిశోర్,బాలు, కంబగిరి, సురేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నీలి శ్రీనివాసులు,డాక్టర్ గాథంశెట్టిరవికుమార్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, గాథంశెట్టి వేణుగోపాల్, మోహన్‌బాబు, శివశంకర్‌రెడ్డి, పుల్లయ్య శెట్టి, పాపన్న, మాదవరెడ్డి,రామసుబ్బారెడ్డి, మహబూబ్‌వలి,కోడూరు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం

దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన జయంతి సందర్భంగా సుమారు రూ.30 లక్షల విలువ నూతన అంబులెన్స్‌ను ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని జయమ్మ దంపతులు కుమారుడు కాటసాని ఓబులరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ మండలంలో చాలా మంది అత్యవసర సమయాల్లో రోగులను నంద్యాల, కర్నూలు వైద్యశాలకు మెరుగైన చికిత్స కోసం తరలించాలంటే ఖర్చుతో కూడిన విషయమని, పేదల సౌకర్యార్థం తమవంతుగా ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ వాహనాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని, రోగులకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లతో పాటు ఏఎన్ఎం కూడా అందుబాటులో ఉంటారన్నారు. అవసరం ఉన్న బాధితులు 80191 98909 నంబరుకు ఫోన్ చేసి అంబులెన్స్ సేవలు ఉచితంగా పొందాలని సూచించారు.

జగనన్న సురక్ష... పేదలకు శ్రీరామరక్ష



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు, చిత్రంలో ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు

డోన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు శ్రీరామరక్షలా ఉపయోగపడిందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు పేర్కొన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమ పథకాలు అందజేసిందని, సాంకేతిక సమస్యల మూలంగా లబ్ధి చేకూరని పేదలకు న్యాయం చేసేందుకు, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందన్నారు. నియోజకవర్గం కేంద్రం డోన్‌తోపాటు ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో 80,787 గృహాలను సందర్శించిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లపై వివరాలు సేకరించారన్నారు. ఇందులో భాగంగా 80 చోట్ల సమావేశాలు నిర్వహించి నియోజకవర్గంలో 45,956 మందికి వివిధ సర్టిఫికెట్లు అవసరం ఉండగా, ఇప్పటికే 44,713 మందికి అందజేశామని, జగనన్న సురక్ష కార్యక్రమం 97 శాతం విజయవంతంగా ముగిసిందన్నారు. ఉచితంగా స్వగ్రామాల్లోనే సర్టిఫికెట్స్ అందజేయడంపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతుందన్నారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, రైల్వే నాగేంద్ర, వంశి, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, మహేష్, రైల్వే జాకీర్ హుసేన్, పెయింటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య జయంతి



పింగళి చిత్రం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్యాపిలి: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యను స్మరించుకోవాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు శ్యాంసన్, మత్తుబాబా సాహెబ్ అన్నారు. స్థానిక కలచట్ల రోడ్డు వద్ద బుధవారం పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పింగళి వెంకయ్య 19 ఏళ్ల ప్రాయంలోనే దక్షిణాఫ్రికాలో జరిగిన రెండో బోయర్ యుద్ధంలో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ గాజుల నరసింహులు, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు శ్రీరాములు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

91 శాతం పింఛన్ల పంపిణీ

కోవెలకుంట్ల: 'వైఎస్సార్ ఫించన్ కానుక' పథకం ద్వారా లబ్ధిదాలకు ఆగస్టు నెల పింఛన్లు ఠంచన్‌గా అందాయి. కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ నెలకు సంబంధించి 5,803 వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, తదితర పింఛన్లు ఉన్నాయి. ఆయా గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి 5,283మందికి అందజేసి బుధవారం నాటికి 91శాతం సాధించినట్లు ఎంపీడీఓ రాధిక పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం మరో మూడు రోజులపాటు కొనసాగుతుందని ఆమె తెలిపారు.

ఎర్రగుంట్లలో పొలంబడి



పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

డోన్: మండలంలోని ఎర్రగుంట్లలో బుధవారం ఏఓ అబ్దుల్ షఫీ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట మార్పిడితో అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయన రైతులకు సూచించారు. కొర్ర పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న గుండం శేషిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని పలుకూరులో బుధవారం ఓసీ కాలనీలో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం మూడు సీసీ రోడ్లు ఏర్పాటుకు రూ.13 లక్షల నిధులు మంజురాయ్యయన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండంపక్కిర్‌రెడ్డి, దాశి తిరుపాల్‌రెడ్డి, వెంకటస్వామి, సచివాలయ కన్వీనర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ జనార్దన్ రావు

సంజామల:మండల పరిధిలోని పేరుసోముల, ముక్కమల్ల, ఆల్వకొండ గ్రామాల్లోని సచివాలయాలను డీఎల్‌డీఓ జనార్దన్ రావు బుధవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్పందన ఫిర్యాదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. కర్నూలు పట్టణానికి చెందిన సింహాద్రి నాగరాజు అనే వ్యక్తి స్కార్పియో వాహనానికి సంబంధించి ఫైనాన్స్ విషయంలో రామకృష్ణ పరిచయం అయ్యాడు. తనకు కల్వకుర్తి డీఎఫ్ఓ బాగా పరిచయమని, ఎర్రచందనం కేసుల్లో సీజ్ అయిన కార్లను తక్కువ ధరకే ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో నాగరాజు రెండువిడతలుగా రామకృష్ణకు ఫోన్‌పే ద్వారా రూ.95వేలు పంపించాడు. కారును ఇప్పించకపోగా డబ్బులు కూడా ఇవ్వనని బెదరింపులకు పాల్పడ్డాని నాగరాజు పోలీసులను ఆశ్రయించాడు.

డాక్టర్ల తీరుపై అసహనం!

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్ల తీరుపై ఓ వ్యక్తి అసహనానికి గురయ్యాడు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆవేశానికి గురైన ఆ వ్యక్తి ఆసుపత్రి బోర్డుపై రాళ్లురువ్వుతూ.. కేకలు పెడుతూ అలజడి సృష్టించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన కుమారునికి చెవి నొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. అయితే డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహించిన వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రి బోర్డుపై రాళ్ళు రువ్వుతూ కేకలు వేశాడు. ఈ సంఘటనను వీడియో తీసిన కొందరు పోస్టింగ్ చేయడంతో వైరల్ అయ్యింది. విషయాన్ని ఆసుపత్రి సూపరిడెంట్ మహ్మద్ హనీఫ్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత వ్యక్తి మద్యం మత్తులో అసహనానికి గురయ్యాడన్నారు. డాక్టర్ వచ్చేవరకు ఓపిక పట్టకుండా రాళ్ల విసిరాడని, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

డోన్ టౌన్ : గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు.స్థానిక కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. పంచాయతీకి సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల వృద్ధి చెందకుండ ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వరప్రసాద్ పంచాయితీ కార్యదర్శులు రవిచంద్ర, మురళి, మోహన్‌ఆచారి, రామకృష్ణ, సురేష్, శర్మ, బాల తిమ్మయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.